## క్లుప్తంగా

### దర్గా వద్ద రేకుల షెడ్డు నిర్మాణం


షెడ్డు వద్ద దాత నారాగౌడ్-సుజాత దంపతులు

సారంగపూర్: మండలంలోని తాండ్ర(జి) గ్రామ సమీపంలోని దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొండా సుభాష్ గౌడ్, ఆయన తల్లిదండ్రులు నారాగౌడ్, సుజాత దంపతులు రూ.60 వేలతో రేకుల షెడ్డును నిర్మించారు. వారు అక్కడే ఉండి పనులు పూర్తి చేయించారు. షెడ్డు నిర్మాణానికి ముందుకొచ్చిన దాతలను గ్రామస్తులు సన్మానించారు.

### వైద్యశిబిరానికి స్పందన


పాల్గొన్న వైద్య సిబ్బంది

కడెం: మండలంలోని ఉడుంపూర్ పంచాయతీపరిధిలోని మిద్దెచింత గ్రామంలో శనివారం ఈవా ఫౌండేషన్, దస్తురాబాద్ పీహెచ్‌సీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. గ్రామస్తులకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇందులో డాక్టర్ విజయ్‌కుమార్, ఈవా ఫౌండేషన్ చైర్మన్ కొమ్ము విజయ్, శైలేంద్ర, కన్నయ్య, లలిత, సంతోష్, సిబ్బంది తదితరులున్నారు.

### ఉపాధి పనులకు రావాలి


పనులు ప్రారంభిస్తున్న ఏపీవో జగన్నాథ్

లోకేశ్వరం: ఉపాధిహామీ కూలీలు విధిగా పనులకు రావాలని ఈజీఎస్ ఏపీవో జగన్నాథ్ అన్నారు. శనివారం మండలంలోని మన్మద్ గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద అభివృద్ధి పనులను ఏపీవో ప్రారంభించి మాట్లాడారు. అర్హులకు జాబ్‌కార్డులు అందించి పనులు కల్పిస్తామని పేర్కొన్నారు. కూలీలకు బిల్లులను సకాలంలో చెల్లిస్తామని అన్నారు. ఆయన వెంట ఈసీ అనిల్ ఉన్నారు.

### కుటుంబాలకు పరామర్శ

లక్ష్మణచాంద: మండలకేంద్రానికి చెందిన ఎర్రన్న, బిర్కుల ఎల్లన్న ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను శనివారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, బిట్లింగ్ నారాయణ, రవి, భూమన్న, వినేశ్, లింగన్న, మోహన్ ఉన్నారు.

### అక్కకొండ లక్ష్మీనృసింహుడి ఆలయానికి విరాళం

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్ సమీపంలోని పురాతన శ్రీ అక్కకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శనివారం స్వామివారికి ఉమేశ్-దంపతులు నైవేద్య కైంకర్యం సమర్పించారు. దిల్దార్‌నగర్‌కు చెందిన అయిలినేని శైలజ-జగన్‌మోహన్‌రావు దంపతులు స్వామి వారి 33 వారాల నైవేద్య కైంకర్యానికి విరాళంగా రూ.10 వేలను అందించినట్లు అర్చకుడు వంశీకృష్ణమాచార్యులు పేర్కొన్నారు.

### అనాథ బాలుడికి ఆర్థికసాయం

భైంసాటౌన్: భైంసా మండలంలోని ఇలేగాం గ్రామానికి రజని.. అతని కొడుకు శివకుమార్‌తో కలిసి వలస వచ్చి నివాసముంటోంది. ఈ క్రమంలో రజని అనారోగ్యంతో మృతి చెందగా బాలుడు అనాథగా మారాడు. అతడి వద్ద డబ్బులు లేకపోవడంతో గ్రామస్తులు, పలువురు దాతలు ముందుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. విరాళాల రూపంలో రూ.28వేలు సేకరించగా.. మిగిలిన మొత్తాన్ని బాలుడికి అందజేశారు. అనంతరం బాలుడిని గ్రామానికి చెందిన నాయకులు ఉప్పు దత్తు, శంకర్, మాజీ సర్పంచ్ అమృత్ సమక్షంలో అతని పెద్దమ్మకు అప్పగించారు.

### చలివేంద్రం ప్రారంభం

బాసర: మండలకేంద్రంలో బస్టాండ్ కూడలి వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎంపీవో గంగాసింగ్ ప్రారంభించారు. పంచాయతీ సిబ్బంది, వార్డు మాజీ సభ్యులు పాల్గొన్నారు.
ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తిలో మెట్‌పల్లి-ఖానాపూర్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎంపీవో రత్నాకర్‌రావు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సురేందర్, గ్రామస్తులు నరేందర్, లింబాద్రి, సంపత్ ఉన్నారు.

## ట్యాంక్ కూలేదాకా చూస్తారా?



లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో పశువైద్యశాల ఆవరణలో నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రమాదకరంగా మారింది. 25 నుంచి 30 ఏళ్ల కిందట కిందట నిర్మించిన ఈ ట్యాంక్ పిల్లర్ల పెచ్చులు ఊడుతుండటంతో ఇనుప చువ్వలు కన్పిస్తున్నాయి. ఇళ్ల మధ్యన ఉన్న ఈ ట్యాంక్ కూలేలా ఉందని.. అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

## వెజిటేబుల్ షో..!



భైంసాటౌన్: విద్యార్థులకు కూరగాయల ప్రాధాన్యత తెలిసేలా పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శనివారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. వివిధ రకాల కూరగాయలను ప్రదర్శించి వాటిలోని పోషకవిలువలు, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రబంధకారిణి సభ్యులు గోపాల్ కిషన్, డి.శ్రీధర్, నగేశ్, ప్రధానాచార్యులు గంగాధర్, ఆచార్యులు పాల్గొన్నారు

## మది దోచేస్తున్నాయ్..



జిల్లాకేంద్రంలోని ఏఎన్‌రెడ్డి కాలనీలో ఓ ఇంటి ముందు విరబూసిన ఈ పూల చెట్టు ప్రజల మదిని దోచేస్తూ ఆహ్లాదం పంచుతోంది. గతంలో పట్టణ సుందరీకరణలో భాగంగా నాటిన మొక్కలు ప్రస్తుతం పూల తివాచీని తలపిస్తున్నాయి. ఈ మొక్కలను (టబూయ రోజేస్) పింక్ పౌయిగా పిలుస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

# ఘనంగా మహిళా దినోత్సవం

భైంసా మండలంలోని పెండ్‌పెల్లి పాఠశాలలో..


బాసర గ్రామపంచాయతీలో..


కుభీర్ : బెల్గాంలో సమావేశమైన మహిళలు


ఖానాపూర్‌లోని ఓ పాఠశాలలో..


జిల్లావ్యాప్తంగా శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కుటుంబబాధ్యతలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బందిని, పోలీసులను, పారిశుధ్య కార్మికులను, వందరోజులు ఉపాధి పనిదినాలు పూర్తి చేసుకున్న మహిళా కూలీలను శాలువాలతో పలువురు సన్మానించారు. మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. భైంసాలో ఏరియాసుపత్రిలో వైద్యసిబ్బంది.. ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఏపీపీ అరుణ ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. నిర్మల్ బస్టాండ్‌లో ఆర్డీవో రత్నకల్యాణి, డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మహిళా ప్రయాణికులను సన్మానించారు. మహిళా కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందించారు. నిర్మల్ జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ న్యాయమూర్తి రాధిక, అదనపు న్యాయమూర్తి భవిష్యను న్యాయవాదులు సన్మానించారు.
– సాక్షి నెట్‌వర్క్


నిర్మల్ బస్టాండ్‌లో సన్మానం అందుకున్న మహిళలు


కడెం: ఎలగడప ప్రభుత్వ పాఠశాలలో మహిళలకు సన్మానం


లక్ష్మణచాంద: మల్లాపూర్‌లో మహిళ కూలీని సన్మానిస్తున్న ఏపీఓ ప్రమీల


ముధోల్ పోలీస్‌స్టేషన్ వద్ద సన్మానం అందుకున్న మహిళా కానిస్టేబుళ్లు, పక్కన సీఐ మల్లేశ్


లోకేశ్వరం: రాజుర ప్రాథమిక పాఠశాలలో మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళలు


భైంసా కోర్టులో మహిళా దినోత్సవం వేడుకల్లో ఏపీపీ అరుణ, ఉద్యోగులు


తానూరు: భోసి గ్రామంలో ఉపాధి కూలీలను సన్మానిస్తున్న అధికారులు


కుంటాలలో కార్మికులు,ఆశవర్కర్లను సన్మానిస్తున్న అధికారులు


సోన్: న్యూవెల్మల్‌లో పని ప్రదేశం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న మహిళలు, అధికారులు


సారంగపూర్: చించోలి(బి)లో జ్ఞాపిక ఇస్తున్న డెంటల్ అసోసియేషన్ ప్రతినిధులు

### పాముకాటుతో గేదె మృతి

కుంటాల:మండలంలోని లింబా(బి) గ్రామంలో కేశెట్టి నగేశ్‌కు చెందిన గేదె శనివారం పాముకాటుతో మృతి చెందింది. ఉదయం పశువుల కాపరి మేత కోసం శివారులోకి గేదెను ఈ క్రమంలో మేత మేస్తున్న గేదెను పాము కాటు వేసింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

### పూజలు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం రాజగోపురం నిర్మాణం పూర్తి కావడంతో ప్రతిష్ఠాపనలో భాగంగా సుదర్శన చక్రం పూజను అర్చకులు రామచంద్రచార్యులు, విజయ్‌స్వామి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రంగుల దీపాలతో ఆలయాన్ని అలంకరించారు.

### పొక్లెయిన్, ట్రాక్టర్లు పట్టివేత

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారులో ఉన్న రెంకోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పొక్లెయిన్‌తోపాటు కొన్ని ట్రాక్టర్లను పట్టుకున్నామని ఏఎస్సై రాంచందర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. అనుమతుల్లేకుండా ఇసుక, మొరం తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నేటి నుంచి ఎల్లమ్మ జాతర

కుభీర్: మండలకేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం నుంచి ఎల్లమ్మ జాతర ప్రారంభంకానున్నట్లు కుభీర్ గీత పారిశ్రామిక సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పుణ్యాహవచనం, గణపతిపూజ, అభిషేకం, దీపారాధన, 10న ఉదయం తొమ్మిది గంటలకు పుట్టకు ధనిపోయుట, సాయంత్రం 4 గంటలకు లందకాడికి పోవుట, ఆరు గంటలకు ఎల్లమ్మకు బోనాల సమర్పణ, రాత్రి ఎనిమిది గంటలకు పుట్ట బంగారం తేవటం, 11న తెల్లవారు జామున ఐదు గంటలకు కల్యాణం, 12గంటలకు గావు పట్టుట, మధ్యాహ్నం 1గంటకు భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

# భైంసాలో ప్రారంభమైన వార్షికోత్సవం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

- 18ఏళ్లు పూర్తి చేసుకున్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయం

భైంసాటౌన్: పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయంలో వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయం నిర్మించి 18ఏళ్లు పూర్తవగా 19వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఈనెల 13వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. సంగారెడ్డికి చెందిన శ్రీమాన్ చక్రవర్తుల సుధన్వాచార్య(యజ్ఞాచార్య) ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిపించనున్నారు. భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

**ఉత్సవాలు ఇలా..**

- 8న శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఉత్సవ అనుజ్ఞ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మంగళశాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.
- 9న ఉదయం 8 నుంచి దీక్షా స్వీకారం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, మూల మంత్రహవనం, తదితర కార్యక్రమాల అనంతరం సాయంత్రం 6 నుంచి విష్ణు సహస్రనామ పారాయణం జరిపిస్తారు.
- 10న ఉదయం 10 గంటలకు శాంతిపాఠం, మూలమంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం.
- 11న ఉదయం 10 నుంచి శ్రీదేవి-భూదేవి సహిత ఎదుర్కోలు సన్నాహకం, 11 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం, అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు.
- 12న ఉదయం 8 గంటలకు శాంతిపాఠం, తదితర కార్యక్రమాలు, సాయంత్రం 5.30 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 7 గంటలకు సామూహిక కుంకుమార్చన ఉంటుంది.
- 13న ఉదయం 8 గంటలకు శాంతిపాఠం, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం, ధ్వజారోహణం, మహా కుంభప్రోక్షణ, మహాదాశీర్వచనాలతో ఉత్సవాలు ముగియనున్నాయి.

### ఏర్పాట్లు పూర్తి చేశాం...

శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరాలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ఆరు రోజులపాటు నిత్యం ఆలయంలో పూజాది కార్యక్రమాలు ఉంటాయి. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలి.
– సాదుల నారాయణ, ఆలయ కమిటీ చైర్మన్

## ‘భయాందోళనకు గురిచేయొద్దు’


మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: పట్టణ వాసులను మున్సిపల్ అధికారులు.. పన్నుల పేరిట భయాందోళనకు గురిచేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్ అన్నారు. పట్టణంలోని విశ్రాంతిభవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పట్టణంలోని స్థిరాస్థిదారులకు పన్నుల వసూళ్లపై నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను, దుకాణాలను సీజ్ చేయడం సరికాదన్నారు. ప్రజల ఇళ్ల ఎదుట చెత్తబండ్లతో సిబ్బందితో వెళ్లి దౌర్జన్యంగా పన్నులు వసూలు చేస్తున్నారని అన్నారు. మరోవైపు కోతులు, కుక్కల బెడదతో ప్రజలు రోడ్డు మీద తిరగని పరిస్థితి ఉందని.. సదరు సమస్యలను పరిష్కరించకుండా ఉన్నతాధికారుల మెప్పు కోసం మాత్రమే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్, నాయకులు శ్రీనివాస్, అనిల్‌రావు, రమేశ్, గోపాల్‌రెడ్డి, సాయికృష్ణ, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

### ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?


రోడ్డు మధ్యలో స్తంభం

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ఊర చెరువు సమీపంలో కాలనీకి వెళ్లే మార్గంలో నడిరోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభంతో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ స్తంభం తొలగించి పక్కన ఏర్పాటు చేయాలని అధికారులను కోరితే.. డీడీ చెల్లించిన తర్వాతే సమస్య పరిష్కరిస్తామని అంటున్నారని కాలనీవాసులు వాపోతున్నారు.

### సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ఖానాపూర్: ప్రతిఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. అక్కడికి వచ్చిన కక్షిదారులకు వేంకటేశ్వర రైస్‌మిల్ యజమాని కిషన్ రెడ్డి భోజన సదుపాయం కల్పించారు. కిషన్‌రెడ్డిని జడ్జి అభినందించారు. న్యాయవాదులు సురేశ్, వెంకట్ మహేంద్ర, కిశోర్‌నాయక్ ఉన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ

మామడ: మండలంలోని నల్దుర్తి, కొరిటికల్ గ్రామాల్లో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు శనివారం పర్యటించారు. నల్దుర్తిలో దొంతుల శంకర్ కూతురు అనారోగ్యంతో.. రొడ్డ గణేశ్ రోడ్డు ప్రమాదంలో, కొరిటికల్‌లో దేవోళ్ల రాజు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా బాధిత కుటుంబాలను పరామర్శించారు. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, నల్ల లింగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో మదిరె సత్యనారాయణ తండ్రి చిన్నపెద్దులు మృతిచెందగా బాధిత కుటుంబాన్ని శ్రీహరిరావు పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు భీంరెడ్డి, సురేశ్, రాజేందర్, శంకర్, సత్యనారాయణ, వెంకటప్పయ్య, కిశోర్, రమేశ్, మారుతి తదితరులున్నారు.


కుంటాలలో పరామర్శిస్తున్న శ్రీహరిరావు

కుంటాల: కుంటాలకు చెందిన న్యాయవాదులు సాదుల సుదర్శన్, గోవర్ధన్, జనార్దన్ తండ్రి మాజీ పట్వారి లింబగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని శ్రీహరిరావు పరామర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గంగ్రత్ ఈశ్వర్, భీంరెడ్డి, ఎంసీ లింగన్న, విలాస్,సాయన్న, న్యాయవాదులు కరుణాకర్ రావు, శంతన్ రెడ్డి,లక్ష్మారెడ్డి, సరోత్తంరెడ్డి, రవికుమార్ ఉన్నారు.

# 11 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న శాంతిపఠం, దేవత ఆజ్ఞ మహాసంకల్పం, గణపతి గౌరిపూజ, స్వస్తి పుణ్యాహవచనం, ధ్వజారోహణం, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహపూజ, 12న శాంతి పఠం, స్థాపిత దేవతాపూజ, సూక్తిహోమనంలు, చండీహోమం, హారతి, నివేదన, 13న శాంతి పఠం, హోమం, జయాదులు, పూర్ణాహుతి, అన్నప్రసాదం, ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ముగింపు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.


ముస్తాబైన ఆలయం

### మరమ్మతులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో దిగువ ప్రాంతానికి నీటి సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న గ్రామపంచాయతీ కార్యదర్శి రాకేశ్, సిబ్బంది శనివారం పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు.